క్లుప్తంగా

నేడు 'రేగడి సీమ కథలు' పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: స్థానిక మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో ఆదివారం కథా రచయిత గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి రచించిన 'రేగడి సీమ కథలు' పుస్తకావిష్కరణ ఉంటుందని నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

సంతకాల సేకరణ

కర్నూలు కల్చరల్: రాయలసీమ సమస్యల పరిష్కార సాధనకు ఆదివారం ఉదయం 11 గంటలకు ఎస్టీబీసీ కళాశాల మైదానంలో సంతకాల సేకరణ చేపడుతున్నట్లు రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 8 జిల్లాల్లోని 52 నియోజకవర్గాల్లో సంతకాల సేకరణ వాహనాలకు మాజీ మంత్రి మైసురారెడ్డితో కలిసి జెండా ఊపి ప్రారంభిస్తామన్నారు. అనంతరం కొండారెడ్డి బురుజు వద్ద ఏర్పాటు చేసిన సంతకాల సేకరణ శిబిరంలో పాల్గొంటామన్నారు.

పౌరాణిక నాటక ప్రదర్శనలు

కర్నూలు కల్చరల్: కళావాహిని సాంస్కృతిక సాహితీ సంస్థ ఆధ్వర్యంలో హనుమజ్జయంతిని పురస్కరించుకుని చెన్నమ్మ సర్కిల్‌లోని సీతారామ దేవాలయం వద్ద ఆదివారం రాత్రి ఉచిత పౌరాణిక నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు సంస్థ అధ్యక్షులు మనోహర్‌బాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మయసభ, శ్రీకృష్ణ పడక సీను, సుభద్రార్జున సీను, సత్య హరిశ్చంద్ర వారణాసి, కాటి సీను, డ్యాన్స్ మాస్టర్ నారాయణస్వామి ఆధ్వర్యంలో భరతనాట్యం, కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ముస్లింల సమావేశం

కర్నూలు(రూరల్): ముస్లింల సమస్యలు – పరిష్కారాలు అంశంపై బి.క్యాంప్‌లోని టీజీ భరత్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉదయం సమావేశం ఉంటుందని ఏపీ ముస్లిం మైనార్టీ కౌన్సిల్ అధ్యక్షుడు రోషన్ అలీ శనివారం తెలిపారు.


కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

కర్నూలు(సెంట్రల్): కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారు. డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకరబాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాణాసంచా పేల్చి, స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షణాదిలో బీజేపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. 2024లో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓటమి చెందడం ఖాయమన్నారు. రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అవుతారని ఆయన జోస్యం చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కొత్తూరు సత్యనారాయణ గుప్తా, బతుకన్న తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కర్నూలు(సెంట్రల్): ఉద్యోగ భద్రత కల్పించాలని 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫ్యామిలీ ఫిజిషియన్ విధానంలో పనిచేస్తున్న 104 ఉద్యోగుల నిరసన దీక్షలు శనివారానికి ఆరో రోజుకు చేరాయి. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఆప్‌కాస్‌లో కలపాలని డిమాండ్ చేశారు. జీఓ నంబర్ 4459 ప్రకారం ఉద్యోగులకు సకాలంలో జీతాలతోపాటు పీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయం కల్పించాలని కోరారు.

ముగిసిన చందన యాత్ర ఉత్సవాలు



ప్రత్యేక అలంకారంలో జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులు

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథుని మందిరంలో నిర్వహిస్తున్న జగన్నాథుని చందన యాత్ర మహోత్సవాలు -2023 శనివారం ముగిశాయి. గత నెల 23న వైశాఖ శుద్ధ తదియ రోజున ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లకు చందన సేవ, అలంకార సేవ, అభిషేక సేవ, సంపూర్ణ నైవేద్య సేవలు నిర్వహించారు. ఇస్కాన్ ప్రవచకులు వైష్ణోకృప చైతన్య ప్రభుదాస్ భక్తులకు సందేశమిచ్చారు. హరే నామ సంకీర్తన జప యజ్ఞం నిర్వహించారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

సాక్షి సినిమాలు

ఎస్వీసీ కాంప్లెక్స్ : కస్టడీ, ఉగ్రం, విరుపాక్ష, ది కేరళ స్టోరీ, పొన్నియిన్ సెల్వన్-2, గార్డియన్స్ ఆఫ్ గెలాక్సీ-3
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : కస్టడీ, ఫర్హానా, భువన విజయం, ఉగ్రం, విరుపాక్ష, ది కేరళ స్టోరీ, రామబాణం
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : కస్టడీ, ఉగ్రం, విరుపాక్ష
ఐనాక్స్ : గార్డియన్స్ ఆఫ్ గెలాక్సీ-3, ఉగ్రం, ది కేరళ స్టోరీ, ఐబీ 71, ఛత్రపతి, ది స్టోరీ ఆఫ్ ఎ బ్యూటిఫుల్ గర్ల్, భువన విజయం
భరత్ కాంప్లెక్స్ : కథ వెనుక కథ, పొన్నియిన్ సెల్వన్-2, ది కేరళ స్టోరీ
శ్రీరామ : రామబాణం
రాజ్ : కస్టడీ, **విజయ :** ది కేరళ స్టోరీ

పంట మార్పిడి.. అధిక దిగుబడి

- ఒకే పంట సాగుతో తగ్గనున్న భూసారం
- చీడ పీడలు ఆశించే అవకాశం
- దిగుబడులూ అంతంత మాత్రమే
- పంట మార్పిడితో భూముల్లో సేంద్రియ పదార్థాలు వృద్ధి
- ఫలితంగా అధిక దిగుబడుల సాధ్యం



మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయాధికారులు

కర్నూలు అగ్రికల్చర్: ఒకే పొలంలో ఒకే పంటను ఏళ్ల తరబడి సాగు చేయడం వల్ల భూసారం తగ్గుతుంది. చీడపీడలు ఆశించి పైర్లలోనూ ఎదుగుదల ఉండదు. ఫలితంగా దిగుబడులూ తగ్గిపోయి అన్నదాతకు నష్టం చేకూరుతుంది. పంట మార్పిడి చేస్తే భూసారం పెరుగుంది. చీడపీడలను తట్టుకునే శక్తి భూమికి వస్తుంది. పైర్లలో ఎదుగుదలా మెరుగ్గా ఉండి అధిక దిగుబడులూ సాధ్యమై అన్నదాతకు లాభాల పంట పండుతుంది. ఒకే పంట సాగు చేయడం వల్ల కలిగే నష్టాలు, పంట మార్పిడి వల్ల కలిగే లాభాల గురించి వ్యవసాయశాఖ కర్నూలు సబ్ డివిజన్ సహాయ సంచాలకులు సాలురెడ్డి(8331057433) 'సాక్షి'కి వివరించారు.

మోనోక్రాపింగ్ (ఒకే పంట సాగు పద్ధతి)తో కలిగే నష్టాలిలా..

- వేరు వ్యవస్థ ఒకే లోతుకుపోవడం వల్ల ఆ లోతు వరకే ఉన్న పోషకాలు మాత్రమే వినియోగించబడతాయి.
- ఏటా ఒకే పంట పండించడం వల్ల చీడ, పీడల సమస్య ఎక్కువగా ఉంటుంది. పైరు కూడా అభివృద్ధి చెందదు.
- కలుపు బెడద కూడా ఎక్కువగా ఉంటుంది. ఇందువల్ల రైతులపై పెట్టుబడి వ్యయం ఎక్కువగా ఉంటుంది.
- నేల కోతకు గురవుతుంది. పండిన పంట కూడా నాణ్యతతో ఉండదు. అందువల్ల గిట్టుబాటు ధర లభించదు.



పంట మార్పిడి ఆవశ్యకతపై పత్తి రైతుకు కర్నూలు ఏడీఏ సాలు రెడ్డి

- ఒక ప్రత్యేక సమయంలో కూలీల ఆవశ్యకత ఎక్కువగా ఉంటుంది. ఇది రైతులకు నష్టం కలిగించే పరిణామం.
- మార్కెటింగ్ సమస్యలు ఎదురవుతాయి. ఒకే పంట సాగు విధానం వల్ల పంట దిగుబడులు తగ్గుతాయి. నాణ్యత ఉండదు. అందువల్ల మార్కెటింగ్ కష్టమవుతుంది.

రైతుల ఆలోచన తీరు మారాలి..

జిల్లాలో అనేక మంది రైతులు ఏటా ఒకే పంటను సాగు చేస్తున్నారు. నీటి పారుదల కింద ఎప్పుడు వరి తప్ప వేరే పంట సాగు చేయడం లేదు. ఇందువల్ల వరిలో చీడ పీడల బెడద ఎక్కువగా కనిపిస్తోంది. జిల్లాలో చాలా వరకు నల్ల రేగడి నేలలను ఖరీఫ్‌లో ఖాళీగా ఉంచుకొని రబీలో శనగ వేస్తున్నారు. శనగ తప్ప వేరే పంటలు వేయడం లేదు. ఇందువల్లనే అనర్థాలు ఏర్పడుతున్నాయి. పంట మార్పిడితో కలిగే ఉపయోగాలను, అనర్థాలను కూడా అవగాహన చేసుకోవాలి. పంట మార్పిడి వల్ల లభిస్తున్న ఫలితాల గురించి రైతులకు తెలుసు. వచ్చే ఖరీఫ్‌లో రైతులు పంట మార్పిడి విధానాన్ని పాటించి అధిక దిగుబడులు సాధించుకోవాలి.

సస్యభ్రమణంలో పాటించాల్సిన జాగ్రత్తలు

- ఎక్కువ లోతు వేర్లు ఉన్న పైర్లు, తక్కువ లోతు వేర్లు ఉన్న పైర్లు ఒక దాని తర్వాత ఒకటి సాగు చేయాలి.(ఉదా: వరి–అపరాలు, జొన్న–పత్తి)
- నేలలను నిర్వీర్యం చేసే పంటలను, సారాన్ని అభివృద్ధి చేసే పంటలను ఒక దాని తర్వాత ఒకటి సాగు చేసుకోవాలి(మొక్కజొన్న–అపరాలు)

లాభాలు..

పంట మార్పిడి పద్ధతి వల్ల అనేక లాభాలు ఉన్నాయి. వీటిపై రైతులు అవగాహన పెంచుకోవాలి. వరి పంటకు ముందు పచ్చిరొట్ట పైర్లు సాగు చేయడం వల్ల భూసారం పెరుగుతుంది. సేంద్రియ పదార్థం భూమిలో ఎక్కువగా ఉండటం వల్ల సూక్ష్మ జీవులు బాగా వృద్ధి చెందుతాయి.

- వరి తర్వాత అపరాలు, వేరుశనగ, సోయా చిక్కుడు లాంటి పైర్లు సాగు చేయడం వల్ల భూమిలో సేంద్రియ పదార్థం పెరిగి భూసారం పెరుగుతుంది. పంటలపై వచ్చే కీటకాలు, శిలీంద్రాలు(భూమి ద్వారా వచ్చే శిలీంద్రాలు) జీవిత చక్రాలకు అంతరాయం ఏర్పడి చీడ పీడల ఉధృతి తగ్గుతుంది.
- వరి తర్వాత చిక్కుడు జాతికి చెందిన శనగ, పెసర, మినుము, వేరుశనగ సాగు వల్ల వాటి వేర్లలోని రైజోబియం బ్యాక్టీరియా గాలిలోని నత్రజనిని తీసుకుంటాయి. వేర్లలో బుడిపెల రూపంలో అవి ఏర్పడి తర్వాత పండించే పంటకు నత్రజనిని అందిస్తాయి. దీనివల్ల భూసారం పెరుగుతుంది.

ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలి



ఏఆర్ పోలీసులకు అవగాహన కల్పిస్తున్న ఏఆర్ డీఎస్పీ

కర్నూలు: ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో విధిగా హెల్మెట్ ధరించి పోలీసులు ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని ఏఆర్ డీఎస్పీ ఇలియాజ్ బాషా సూచించారు. ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీసులకు జిల్లా పోలీసు కార్యాలయంలో హెల్మెట్‌పై శనివారం ఏఆర్ డీఎస్పీ ఇలియాజ్ బాషా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అతివేగం, మద్యం తాగి, ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపకూడదని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యాలకు చేరుకోవాలన్నారు. పోలీసు శాఖలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడుపుతూ ఇతరులకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు వీఎస్ రమణ, పోతురాజు, శివారెడ్డితో పాటు ఆర్‌ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

కర్నూలు రూరల్: ప్రతి ఒక్కరూ రోడ్డు, నియమ, నిబంధనలు పాటించాలని పీస్ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ అధ్యక్షుడు దరగయ్య తెలిపారు. నగరంలో ఆ సంస్థ ఆధ్వర్యంలో లారీ డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణా కార్యక్రమానికి హాజరైన డ్రైవర్లతో రోడ్డు భద్రత గురించి ప్రతిజ్ఞ చేయించి వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. వాహన రంగంలో 50 ఏళ్ల అనుభవం ఉన్న అబ్దుల్ రషీద్‌ను సన్మానించారు.

ప్రభుత్వ పథకాలతో ఆర్థిక భరోసా



సమస్యలు వింటున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): ప్రభుత్వ పథకాలతో పేదలకు ఆర్థిక భరోసా అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. శనివారం ఆయన రెండో వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జామియా మర్కజ్ మసీదు, మున్సిపల్ పార్కు, ఖల్లా వీధి ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలను పలకరించారు. ప్రభుత్వం నాలుగేళ్లలో మంజూరు చేసిన పథకాల సంక్షేమ క్యాలెండర్‌ను అందించారు. వారి సమస్యలు తెలుసుకుని నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ పేదల కష్టాలను స్వయంగా చూసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాటిని తొలగించేందుకు అనేక పథకాలు తీసుకొచ్చారన్నారు. ఆయన సీఎం అయ్యాక తొలి సంతకం పింఛన్ల పెంపుపైనే పెట్టారని, దీంతో పాటు ప్రతి వర్గానికి మేలు జరిగేలా పథకాలు అమలు చేశారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం టీడీపీ కార్యకర్తలకు, నేతలు సిఫార్సు చేసిన వారికే పథకాలు మంజూరు అయ్యేవన్నారు. ప్రస్తుతం అవినీతికి తావులేకుండా, కుల, మత, రాజకీయాలకు తావు లేకుండా అర్హులందరికీ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక వార్డు ఇన్‌చార్జ్ ఫిరోజ్, వార్డు నాయకులు చాంద్ బాషా, అనురాధ, ఖాజా, మున్న, అస్లాం, రైల్వే ప్రసాద్, వివిధ శాఖ అధికారులు, ఉద్యోగులు, పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు




స్థానికుడికి సంక్షేమ క్యాలెండర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రజల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ 20వ వార్డు 53వ సచివాలయం పరిధిలోని మారుతి మెగాసిటీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాలనీలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే ప్రజా ప్రతినిధులందరం గడప గడపకు వస్తున్నామన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సకాలంలో ప్రభుత్వం అందిస్తున్న పథకాలను తెలియజేస్తున్నారా? లేదా ? అని ఆరా తీశారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లని ఎమ్మెల్యే అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు చెప్పని వాటిని కూడా అందిస్తున్నామన్నారు. టీడీపీ పాలనలో అర్హులైన ఉండినా సంక్షేమ పథకాలు రావాలంటే జన్మభూమి కమిటీ సిఫారసులతో పాటు నాయకులు అండదండలు ఉండేవన్నారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనలో తేడాను గమనించాలన్నారు. కరోనా మహమ్మరితో రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు బాగాలేకున్న పేద ప్రజల అభ్యున్నతి ధ్యేయంగా సీఎం జగనన్న సంక్షేమ పథకాలను కొనసాగించారని గుర్తు చేశారు. నగరంలో ప్రాధాన్యతలను అనుసరించి వార్డులో రోడ్లు, డ్రైనేజీ కాలువలు, కల్వర్టులు నిర్మిస్తున్నామన్నారు. రాబోయ్యే ఎన్నికల్లో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుందమని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నాగలక్ష్మిరెడ్డి, అరుణ, చిట్టెమ్మ, శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, లక్ష్మికాంతరెడ్డి, డీఏఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్ రెడ్డి, అర్బన్ వార్డుల జేసీఎస్ కన్వీనర్లు గోవర్దన్‌రెడ్డి, హనుమంతురెడ్డి, యూనస్ బాషా, వార్డు నాయకులు భీమశంకర్‌రెడ్డి, రంగారెడ్డి, సంజీవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, దొరస్వామి, శివశంకర్‌రెడ్డి, అంబటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక బీటెక్ విద్యార్థి మృతి



మృతిచెందిన మన్సూర్

కర్నూలు: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక బీటెక్ విద్యార్థి దూదేకుల మన్సూర్ (21) మృతిచెందాడు. నంద్యాల జిల్లా పాములపాడు మండలం కృష్ణారావుపేటకు చెందిన మాలిక్ బాషాకు ఇద్దరు కుమారులు. రెండో కుమారుడు మన్సూర్ కేవీ సుబ్బారెడ్డి కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కాలేజీ యాజమాన్యం సెలవు ప్రకటించడంతో వారం క్రితం స్వగ్రామానికి వెళ్లాడు. శుక్రవారం కర్నూలులో స్నేహితుని పెళ్లి వేడుకలో పాల్గొనేందుకు వచ్చి మరో స్నేహితుడు రేవంత్‌తో కలిసి మోటార్‌సైకిల్‌పై పంచలింగాల వద్ద ఉన్న దాబాకు వెళ్లి అర్ధరాత్రి తిరిగి కర్నూలుకు వస్తూ చౌరస్తా ఆంజనేయస్వామి గుడి వెనుక సర్వీస్ రోడ్డులో ఆగివున్న లారీని ఢీకొట్టారు. ప్రమాదంలో మన్సూర్ తలకు బలమైన గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించగా కోలుకోలేక రాత్రి మృతిచెందాడు. శనివారం తండ్రి మాలిక్ బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీ సీఎం కప్ విజేతలకు సత్కారం

కర్నూలు (టౌన్): ఈనెల 1 నుంచి 5వ తేదీ వరకు తిరుపతి పట్టణంలోని ఎస్వీ యూనివర్సిటీ క్రీడామైదానంలో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ సీఎం కప్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా వెయిట్ లిఫ్టర్లు ప్రతిభ చాటారు. రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్‌లో రన్నరప్ చాంపియన్‌షిప్ సాధించారు. అలాగే 61 కేజీల విభాగంలో ఎస్.అబ్దుల్లా బంగారు, బి.వీరేష్ కాంస్యం సాధించారు. 49 కేజీల విభాగంలో జి.తులసీ కాంస్యం, 71 కేజీల విభాగంలో ఎం.పుష్పాంజలి కాంస్యం, 87 కేజీల విభాగంలో ఏ.నాగమణి కాంస్యం, 102 కేజీల విభాగంలో పర్వేజ్ ముస్తాఫ్ బంగారు, 67 కేజీల విభాగంలో అబ్దుల్‌హక్ వెండి, 102 కేజీల విభాగంలో గురు చిద్విలాస్ కాంస్యం సాధించారు. వీరితో పాటు కోచ్ యూసుఫ్‌లను న్యాయవాది శ్రీధర్ రెడ్డి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ నటరాజరావు పాల్గొన్నారు.

తోపుడు బండి వ్యాపారి ఆత్మహత్య



పుట్టా శ్రీను మృతదేహం

కర్నూలు: ప్రభుత్వాసుపత్రి ముందు రోడ్డు మీద తోపుడు బండిపై టిఫిన్ సెంటర్ నడుపుతూ జీవనం సాగిస్తున్న పుట్టా శ్రీను (56) ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన స్వామిరెడ్డి నగర్‌లో నివాసముంటాడు. కొన్నేళ్లుగా షుగర్, బీపీ జబ్బులతో బాధ పడుతుండేవాడు. జబ్బు తీవ్రమై గ్యాంగ్రీన్‌గా మారడంతో ఆరు మాసాల క్రితం కుడి కాలికి ఉన్న మూడు వేళ్లు తొలగించారు. దీంతో వ్యాపారం మానుకొని ఇంటి వద్దే ఉంటున్నాడు. కుటుంబ పోషణ భారమై ఆర్థిక ఇబ్బందులు తాళలేక తీవ్ర మనస్థాపానికి గురై ఇంట్లోనే క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులు కనుగొని ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈయనకు భార్య శిరోమణితో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు మూడవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సుంకేసులకు 350 క్యూసెక్కుల ఇన్ ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు శనివారం 350 క్యూసెక్కుల నీటి ఇన్ ఫ్లో ఉంది. కర్నూలు నగర ప్రజల తాగు నీటి అవసరాల నిమిత్తం కేసీ కాల్వకు 189 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలో 1.194 టీఎంసీల నీరు నిల్వ ఉందని డ్యాం అధికారులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అనఘాష్టమి వ్రతం

కర్నూలు కల్చరల్: నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం కృష్ణ పక్షం అష్టమిని పురస్కరించుకుని దత్తాత్రేయస్వామికి అనఘాష్టమి వ్రతం, కాలభైరవ హోమం నిర్వహించారు. భక్తులు స్వామి వార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



అనఘాష్టమి వ్రతంలో పాల్గొన్న భక్తులు

రూ.15.80 కోట్లతో మార్కెట్ యార్డుల్లో మౌలిక సదుపాయాలు

- రూ.4.75 కోట్లతో సీ.క్యాంపు రైతుబజారు విస్తరణ
- రేపు క్షేత్రస్థాయిలో నాబార్డు బృందం పరిశీలన

కర్నూలు(అగ్రికల్చర్): మార్కెటింగ్ శాఖలో నాబార్డు నిధులతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టేందుకు రంగం సిద్ధమైంది. కర్నూలు జిల్లాలో రూ.15.80 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.33 లక్షలలో వివిధ మార్కెట్ యార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నాబార్డు నిధులు మంజూరు చేస్తోంది. జిల్లాలో చేపట్టేబోయే పనులను ఈ నెల 15న నాబార్డు సీనియర్ అధికారుల బృందం పరిశీలించనుంది. నాబార్డు అధికారుల క్షేత్రస్థాయి పర్యటన తర్వాత నిధులు విడుదల అవుతాయి. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో తాగునీటి సదుపాయాన్ని మరింత మెరుగుపరిచేందుకు రూ.10 లక్షలు, కర్నూలు మార్కెట్‌లో పరిపాలన భవనం, టెండరు హాల్, రైతు విశ్రాంతి భవనం ఆధునీకరణకు రూ.30 లక్షలు, జంబోషెడ్ నిర్మాణానికి రూ.6 కోట్లు, టాయ్‌లెట్ బ్లాక్ నిర్మాణం కోసం రూ.10 లక్షలు మంజూరు చేయనున్నారు. అలాగే కర్నూలు సీ.క్యాంపు రైతుబజారు విస్తరణకు రూ.4.75 కోట్లు, గూడూరు వ్యవసాయ మార్కెట్ యార్డు కాంపౌండు వాల్ నిర్మాణానికి రూ.కోటి, కోడుమూరు మార్కెట్ యార్డు కంపౌండువాల్ నిర్మాణానికి రూ.కోటి ప్రకారం నిధులు మంజూరు కానున్నాయి. అమడగుంట్ల, బసాపురం, జి.సింగవరం, రేమట, ఉల్చాల గ్రామాల్లో మల్టీపర్పస్ గోదాముల నిర్మాణాలకు రూ.11 లక్షలు, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డులో జంబోషెడ్ నిర్మాణానికి రూ.2 కోట్లు ప్రకారం నాబార్డు నిధులు మంజూరు చేయనుంది. నంద్యాల జిల్లా జూపాడుబంగ్లా మండలం మండ్లెం, నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు–1, పాములపాడు–2ల్లో గోదాముల నిర్మాణాలకు రూ.11 లక్షల ప్రకారం నిధులు మంజూరు కానున్నాయి. ఈ నెల 15న నాబార్డు టీమ్ కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ, సీ.క్యాంపు రైతుబజారు, కోడుమూరు, ఎమ్మిగనూరులలో పర్యటించనున్నట్లుగా మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపారు.

జాబ్‌మేళా పోస్టర్ల విడుదల



పోస్టర్స్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఎంఏ హాఫీజ్‌ఖాన్, తదితరులు

కర్నూలు సిటీ: ఈనెల 16న ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కేవీఆర్ మహిళ డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేయనున్న మెగా జాబ్ మేళాకు సంబంధించిన వాల్ పోస్టర్లను శనివారం ఎమ్మెల్యే ఎం.ఏ హాఫీజ్‌ఖాన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా ఉపాధి, కల్పన శాఖ అధికారి సోమశివరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్యలు మాట్లాడుతూ పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లమా, ఎంబీఏ, బీటెక్ పూర్తి చేసిన 18 ఏళ్ల నుంచి 40 ఏళ్లలోపు నిరుద్యోగ యువతి, యువకులు అర్హులన్నారు. గ్రీన్‌టెక్, హెటిరో, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, జియో మార్ట్, హీల్ మై ఫ్యామిలీ, ముత్తూట్ ఫైనాన్స్, బీఎంఎస్ సెక్యూరిటీస్, వన్ పాయింట్..వన్ సొల్యూషన్ తదితర కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు వేతనం ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్నవారు httpr:/bit.y/3poxiv వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 8309283980, 6300009183 నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, సీడాప్ జిల్లా మేనేజర్ కిరణ్ పాల్గొన్నారు.

కోర్టు నోటీసులకు స్పందించిన భవన యజమానులు



పెండింగ్ దరఖాస్తులు క్లియర్ చేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలో అనుమతులు తీసుకొని భవనాల ఫీజు పూర్తి స్థాయిలో చెల్లించని యజమానులకు లోక్ అదాలత్ కోర్టు నోటీసులు జారీ చేసింది. ఇప్పటికే పలుమార్లు నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడంతో 480 మందికి మరోసారి నోటీసులు జారీ చేశారు. దీంతో స్పందించిన భవన యజమానుల బకాయి దారులు ఫీజు చెల్లించేందుకు నగరపాలక కార్యాలయానికి తరలి వచ్చారు. అధికారులు టౌన్ ప్లానింగ్ విభాగంలో నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి పెండింగ్ దరఖాస్తులు క్లియర్ చేశారు. శనివారం ఒక్క రోజే రూ.87 లక్షలు ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అడిషనల్ సిటీ ప్లానర్ రంగస్వామి, టీపీఏస్‌లు దామోదర్, శబరీష్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది రాముడు, యువరాజు పాల్గొన్నారు.